## సర్వమతాలకు సమ ప్రాధాన్యం

● మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి, ఏప్రిల్ 11: రాష్ట్రంలో అన్ని మతాలు, కులాలకు ప్రాధాన్యతను కల్పించి వారి అభివృద్ధికి తోడ్పాటునందిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. రంజాన్ పండుగ పురస్కరించుకొని గురువారం ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ పదేండ్ల పరిపాలనలో ఏ రోజూ కూడా మతఘర్షణలకు తావు ఇవ్వకుండా పరిపాలన సాగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మత ఘర్షణలకు మళ్లీ హైదరాబాద్ కేంద్ర బిందువుగా మారే ప్రమాదాలు చోటు చేసుకొనే అవకాశాలు కన్పిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వమంటేనే కరువు, కక్షసాధింపులు మారుపేరని ఎద్దేవా చేశారు. ప్రశాంత వాతావరణంగా ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని రావణా కాష్టంగా మార్చుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలకు సుపరిపాలన అందించేంది పోయి, కక్షలు సాధింపులకు పాల్పడుతుని దుయ్యబట్టారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, అధికారి ప్రతినిధి వాకిటి శ్రీధర్, పట్టణ అధ్యక్షుడు పలుస రమేశ్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు పరంజ్యోతి, అశోక్, జాత్రు నాయక్, నాగన్నయాదవ్, తిరుమల్, నీలస్వామి, శ్రీను, జోహెబ్, గిరి, వెంకటేశ్, శేఖర్, శంకర్‌నాయక్, మైనార్టీ నాయకులు గులాం, బాబుమియ్యా, రహీం, ఆరీఫ్ పాల్గొన్నారు.

## బాల్య వివాహాలపై ప్రజలకు అవగాహన



బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న సొసైటీ సభ్యులు

కొత్తకోట, ఏప్రిల్ 11: పట్టణంలోని దళితవాడలోని ఎంబీ చర్చి వద్ద గురువారం బాల్యవివాహాలపై రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు కైలాస్ హరికృష్ణ మాట్లాడుతూ బాల బాలికలకు చిన్న వయస్సులో పెండ్లిళ్లు చేయడంతో అమ్మాయిలు గర్భం దాల్చి అనారోగ్యాలకు గురవుతారని, పుట్టబోయే పిల్లలు కూడా అంగవైకల్యంతో పుడుతారన్నారు. ఎవరైనా మైనర్లకు వివాహాలు చేస్తే చట్టరీత్యా నేరమన్నారు. అలాంటి వారిపై చైల్డ్‌లైన్ 1098లేదా అంగన్‌వాడీ టీచర్లకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో అనంత్, నిక్సన్, ఇజ్రాయిల్, రజనీకాంత్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యాసరచన పోటీల విజేతలు వీరే..

అయిజ, ఏప్రిల్ 11: అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని ఈనెల 6న నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన విద్యార్థుల వివరాలను అంబేద్కర్ ఉత్సవ కమిటీ గురువారం ప్రకటించింది. 240 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మొదటి బహుమతి జోషిత (ఠాగూర్ ఉన్నత పాఠశాల), రెండో బహుమతి వినోద్‌కుమార్ (బీజీఆర్ ఉన్నత పాఠశాల), మూడో బహుమతి అర్మిన్ నిస్సి (ఎస్‌ఆర్ విద్యానికేతన్, గద్వాల) విద్యార్థులు గెలుపొందినట్లు తెలిపింది. విజేతలకు ఈనెల 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా నగదు బహుమతులను అందజేయనున్నట్లు పేర్కొంది.

## 'చలో జడ్చర్ల' పోస్టర్లు విడుదల



పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

వడ్డేపల్లి, ఏప్రిల్ 11: మున్సిపాలిటీ కేంద్రమైన శాంతినగర్‌లో గురువారం మాదాసి, మాదారి కురుమ సంఘం నాయకులు చలో జడ్చర్ల పోస్టర్లు విడుదల చేశారు. మాదాసి, మాదారి హక్కుల పోరాటానికి జడ్చర్లల్లోని చంద్రగార్డెన్‌లో అంబేద్కర్ జయంతిరోజు నిర్వహించే సభకు హాజరుకావాలని కోరుతూ ముద్రించిన పోస్టర్లు విడుదల చేశారు. హక్కుల కోసం, కుల ధ్రువీకరణ పత్రాలు పొందేవరకు పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పల్లయ్య, పెద్దసోమన్న, యాపదిన్నె రంగన్న, బంగారు పర్వతాలు, తిక్కన్న, గోకారి, కృష్ణ, అడివప్ప, చిన్నస్వామి, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

## సుందరకాండ పారాయణం ప్రారంభం

పాలమూరు, ఏప్రిల్ 11 : మన్యంకొండ శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలోని హనుమద్దాసుల మండపంలో సుందరకాండ పారాయణాన్ని గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమం శనివారం వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త మధుసుదన్‌కుమార్, ఈవో శ్రీనివాసరాజు తెలిపారు. కార్యక్రమంలో పర్యవేక్షకుడు నిత్యానందచారి, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఎర్రవల్లి చౌరస్తా, ఏప్రిల్ 11:రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం ఇటిక్యాల పీఎస్ పరిధిలో చోటుచేసుకున్నది.ఎస్సై వెంకటేశ్ కథనం మేరకు రాయిచూర్‌కు చెందిన బోయ వీరేశ్(40)బీచుపల్లి దగ్గర చెత్తకాగితాలు ఏరుకుంటు జీవనం సాగిస్తుండేవాడు. బుధవారం రాత్రి మూడుటైర్ల రీక్షాపై బీచుపల్లి బిడ్జిపై రాంగ్‌రూట్ లో వెళ్తుండగా పెబ్బేర్ నుంచి వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో తీవ్రగాయాలయ్యాయి. గద్వాల దవాఖానలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

NAMASTHE TELANGANA CLASSIFIEDS

FINANCIAL SERVICES

★ రుణాలు, వ్యక్తిగత, వ్యవసాయ, వ్యాపార రుణం, అతి తక్కువ వడ్డీ రేటుతో, సిబిల్ అవసరం లేదు! NPA కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఏజెంట్స్ కావలెను. నొవా ఫైనాన్స్. ఫోన్: 7696660523.

NT-311979_All


ప్రకటన

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794


# భక్తిశ్రద్ధలతో ఈద్-ఉల్-ఫితర్

● ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న ముస్లింలు
● శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, విజయుడు, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ప్రవీణ్‌కుమార్



ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే బండ్ల

అలంపూర్‌లో ఎమ్మెల్యే విజయుడు

ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్ , ఏప్రిల్ 11 : రంజాన్ పర్వదినాన్ని జోగుళాంబ గద్వాల, వనపర్తి జిల్లాల వ్యాప్తంగా గురువారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. గద్వాల జిల్లా కేంద్రంలోని రాఘవేంద్ర కాలనీ సమీపంలోని పెద్ద ఈద్గా వద్ద ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే వివిధ మండలాల్లోని ఆయా గ్రామాల్లోని ముస్లింలు అధికసంఖ్యలో ఈద్గా వద్దకు తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రార్థనల అనంతరం ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ప్రార్థనల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జిల్లా పోలీస్ యంత్రాంగం బందోబస్తు చేపట్టింది.

జోగుళాంబ గద్వాల జిల్లా రంజాన్ వేడుకల్లో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ప్రవీణ్‌కుమార్, అలంపూర్‌లో ఎమ్మెల్యే విజయుడు పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉన్నప్పుడు ముస్లింలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. అలాగే కొత్తకోట పట్టణంలో ఈద్గా వద్దకు దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి కాంగ్రెస్ నాయకులతో వెళ్లి ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

వనపర్తి పట్ట ణ ం లోని గోపాల్‌పేట రోడ్డులో ఉన్న ఈద్గా వద్ద రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహి ం చా రు. సా మూ హి క ప్రార్థనల అనంతరం రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి , ఎమ్మెల్యే మేఘారెడ్డి, కాంగ్రెస్ నాయకులు, బీఆర్ఎస్, బీజేపీ, టీడీపీ, ఐక్యవేదిక నాయకులు ముస్లింలను అలింగనం చేసుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.



గద్వాల జిల్లాకేంద్రంలో ఈద్గా వద్దకు వస్తున్న ముస్లింలు



గద్వాల జిల్లాకేంద్రంలో ఈద్గా వద్దకు వస్తున్న ముస్లింలు



కొత్తకోటలో ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే జీఎమ్మార్



గద్వాల జిల్లాకేంద్రంలోని ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



వనపర్తి జిల్లాకేంద్రంలోని ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

# పోలీసుల తీరుపై చిన్నారెడ్డి అసహనం

పెబ్బేరు, ఏప్రిల్ 11 : పెబ్బేరు పోలీసుల తీరుపై రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. గత మంగళవారం రాత్రి పట్టణంలోని పలు దుకాణాల్లో దొంగలు చోరీలకు తెగబడిన నేపథ్యంలో గురువారం ఆయన ఘటనా స్థలాలను పరిశీలించారు. బాధితులతో వివరాలు సేకరించిన ఆయన పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఎస్సై హరిప్రసాదరెడ్డితో మాట్లాడారు. ఇటీవలి కాలంలో పెబ్బేరులో దొంగతనాలు ఎక్కువగా అవుతున్నప్పటికీ పోలీసులు నియంత్రణ చర్యలు తీసుకోవడం లేదని ఆయన ఆరోపించారు. రాత్రి పూట పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారా లేదా అంటూ ప్రశ్నించారు. మార్కెట్ గోదాం అగ్ని ప్రమాదం జరిగినా ఇంత వరకు నిందితులను తేల్చలేకపోయారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందని, వారం లోగా దొంగతనాల కేసులను ఛేదించకుంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని చిన్నారెడ్డి హెచ్చరించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

### షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

వనపర్తి టౌన్, ఏప్రిల్ 11 : జిల్లా కేంద్రంలోని సూర్య చంద్ర స్కూల్ రోడ్డులో షార్ట్ సర్క్యూట్‌తో గురువారం ఇల్లు దగ్గమైంది. విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి పరిసరాలను పరిశీలించారు. ఫ్రిజ్‌కు షార్ట్ సర్క్యూట్ రావడంతో ఇంట్లోని విలువైన వస్తువులు దగ్ధం కావడంతో రూ.3లక్షల ఆస్తినష్టం వాటిల్లిందన్నారు. ప్రమాద సమయంలో కుటుంబ సభ్యులందరూ ఇంట్లోనే ఉన్నా ఎవరికీ ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి సాయం అందిస్తామని చిన్నారెడ్డి మనోధైర్యం కల్పించారు. వెంటనే తాసీల్దార్‌కు ఫోన్ చేసి పంచనామా చేసి ఆస్తి నష్టం రిపోర్ట్‌ను త్వరగా అందజేయాలని కోరారు.

### సీపీఎం కార్యదర్శికి పరామర్శ..

ఇటీవల అనారోగ్యానికి గురైన సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.డీ జబ్బార్‌ను గురువారం రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి పరామర్శించారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్ నాయకులు బి.కృష్ణ, కిరణ్, జనార్దన్, భాస్కర్, రాగివేణు, బాబా, వినోద్ ఉన్నారు.



ఎస్సైతో మాట్లాడుతున్న చిన్నారెడ్డి

## బైక్, ట్రాక్టర్ ఢీ : ఇద్దరికి గాయాలు

గోపాల్‌పేట, ఏప్రిల్ 11 : బైక్, ట్రాక్టర్ ఢీ కొన్న ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడిన ఘటన గురువారం రేవల్లి మండలంలోని చెన్నారం సమీపంలో చోటు చేసుకున్నది. ఎస్సై తిరుపతిరెడ్డి కథనం మేరకు.. రేవల్లి మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన అరవింద్, దీపక్ ఇద్దరు కలిసి చెన్నారం వెళ్తుండగా, చెన్నారం గ్రామ సమీపంలోని రైస్‌మిల్ వద్ద పొలాల నుంచి రోడ్డు పైకి ఎక్కుతున్న చెన్నారం గ్రామానికి చెందిన జంగం రాములు ట్రాక్టర్, బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో అరవింద్, దీపక్‌కు కాళ్లకు బలమైన దెబ్బలు తగిలాయి. సమాచారం తెలిసిన పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి గాయపడిన వారిని 108లో వనపర్తి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అరవింద్ వ్యవసాయం చేస్తుండగా, దీపక్ ఇటీవలే ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు రాసినట్లు ఆయన తెలిపారు.

# ఆదర్శప్రాయుడు జ్యోతిరావు ఫూలే

● జోగుళాంబ గద్వాల కలెక్టర్ సంతోష్
● జ్యోతిరావు పూలేకు నివాళి



గద్వాలలో జ్యోతిరావుపూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ సంతోష్

గద్వాల, ఏప్రిల్ 11 : బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి, స్త్రీ విద్యకోసం పాటుపడిన జ్యోతిరావుపూలే అందరికి ఆదర్శప్రాయుడని కలెక్టర్ సంతోష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆవరణలో జిల్లా వెనుక బడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన మహాత్మాజ్యోతిరావు పూలే జయంతి వేడుకల్లో అదనపు కలెక్టర్లు అపూర్వచౌహాన్, వెంకటేశ్వర్లుతో కలిసి కలెక్టర్ పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలకు విద్యను అందించేందుకు అహర్నిశలు శ్రమించిన మహాత్మాజ్యోతిరావు పూలే జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కులాలకు అతీతంగా బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం పాటు పడిన వ్యక్తి అని కొనియాడారు. తన భార్య సావిత్రీబాయి పూలేతో కలిసి దేశంలో మహిళలకు విద్యను అందించేందుకు పాఠశాలలను ప్రారంభించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఏవో వీరభద్రప్ప, అధికారులు శ్వేతాప్రియదర్శిని, రమేశ్‌బాబు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

### బడుగుల ఆశాజ్యోతి

అయిజ, ఏప్రిల్ 11: భరతమాత ముద్దుబిడ్డ, బడుగుజాతుల ఆశాజ్యోతి, సామాజిక సంస్కరణల స్ఫూర్తిప్రదాత, మహిళా విద్యాభివృద్ధికి మార్గదర్శి మహాత్మ జ్యోతిరావు పూలే అని మున్సిపల్ చైర్మన్ దేవన్న అన్నారు. గురువారం పట్టణంలోని అంబేద్కర్ చౌక్‌లో జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పూలే సేవలు జాతి ప్రగతికి నిత్య స్ఫూర్తిదాయకం, ఆచరణీయమన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### ఉండవెల్లి మండలంలో..

ఉండవెల్లి, ఏప్రిల్ 11: మండల కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో వివిధ ప్రజాసంఘాల అధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే జయతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపట్టానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి రాజు, సీపీఎం జిల్లా నాయకులు మద్దిలేటి, సీఐటీయూ నాయకులు సుంకన్న, పాండు, ప్రభాకర్, రైతు సంఘం నాయకులు శేఖర్‌రెడ్డి, రాంబాబు, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

### వడ్డేపల్లి మండలంలో..

వడ్డేపల్లి, ఏప్రిల్ 11: మున్సిపాలిటీ కేంద్రమైన శాంతినగర్‌లో గురువారం పూలేజయంతి వేడుకలను కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు పరంజ్యోతి, విజయ్‌కుమార్, సవారన్న, సంజీవరాజు, హమాలీ సంఘం నాయకులు నాగరాజు, సత్యారాముడు తదితరులు పాల్గొన్నారు.

### అమరచింత మండలంలో..

అమరచింత, ఏప్రిల్ 11: సామాజిక ఉద్యమకారుడు, సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే జయంతిని గురువారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్, మండల అధ్యక్షుడు శ్యాంసుందర్ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళుల ర్పించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు అరుణ్‌కుమార్, విజయ్, సుజ్ఞానం తదితరులు ఉన్నారు.

### సామాజిక తొలి విప్లవకారుడు

వనపర్తి టౌన్, ఏప్రిల్ 11 : సామాజిక తొలి విప్లవకారుడు జ్యోతిరావు పూలే అని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం, ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం, ఉద్యోగ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ కళాశాల ఆవరణ, కేవీపీఎస్ కార్యాలయంలో గురువారం వేర్వేరుగా జ్యోతిరావు పూలే జయంతిని నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుట్టపాగల మహేశ్, వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ, విభేది నారాయణ, లక్ష్మి, రవియాదవ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చీర్ల చందర్, సాయిచరణ్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాధాకృష్ణ, భగత్, డాక్టర్ వంశీ, గట్టన్న, బీసన్న, మధు, రాము, రంజిత్, చంద్రశేఖర్, మద్దిలేటి , ప్రజా సంఘాల నాయకులు రాజారాంప్రకాశ్, నాయకంటి నర్సింహాశర్మ, కవి గిరిరాజాచారి, గంధం నాగరాజు, సతీశ్‌యాదవ్, దేవన్ననాయుడు ఉన్నారు.

### పెబ్బేరు మండలంలో..

పెబ్బేరు, ఏప్రిల్ 11: పెబ్బేరు పట్టణంలో గురువారం మహాత్మా జ్యోతీరావు పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్దనున్న పూలే విగ్రహానికి పలువురు నాయకులు, యువజన సంఘాల వారు పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ, వైస్‌చైర్మన్ కర్రెస్వామి పూలే చేసిన సేవలను కొనియాడారు.

### చిన్నంబావి మండలంలో..

చిన్నంబావి, ఏప్రిల్ 11: సామాజిక తొలి విప్లవకారుడు, సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను గురువారం మండలంలోని పెద్దమారుర్ గ్రామంలో ఉపాధి హామీ కూలీ పనుల వద్ద ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి గ్రామస్తులు పూలమాల వేసి నివాళులరిగగ్పంచారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎస్.శ్రీనివాసులు, శివనారాయణరావు మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామస్తులు ధర్మారెడ్డి, కుమ్మరి రాజు, సహాదేవుడు, గడ్డం శ్రీనివాసులు, దాసరి వెంకటస్వామి, నర్సింహ, శివకృష్ణ, ఉపాధిహామీ కూలీలు బుచ్చమ్మ, శాంతమ్మ, లచ్చమ్మ, విజయలక్ష్మి, భవిత, ఊర్మిళ ఉన్నారు.

### పాన్‌గల్ మండలంలో..

పాన్‌గల్, ఏప్రిల్ 11 : మహాత్మ జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకొని మండలకేంద్రంలో ఎంపీపీ శ్రీధర్ రెడ్డి, సీఐటీయూ జిల్లా నాయకుడు సూర్యవంశం రాము ఆధ్వర్యంలో గురువారం జయంతి వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఆనాటి సమాజంలో స్త్రీ వెనుకబాటు తనానికి అణచివేతకు విద్యాజ్ఞానం లేకపోవడమే ప్రధాన కారణమని గ్రహించి జ్యోతిరావు పూలే స్త్రీ విద్య కోసం కృషి చేశారని తెలిపారు. బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతిగా పేరొందారని తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.



పెబ్బేరులో పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్



అయిజలో నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్, ప్రజా సంఘాల నాయకులు



పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో నివాళులర్పిస్తున్న నాయకులు